# కుట్రలు, కుతంత్రాలే కాంగ్రెస్ విధానం



పుట్టపాకలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

- బీఆర్ఎస్‌తోనే మంథని నియోజకవర్గ ప్రగతి
- తాను ఎమ్మెల్యేగా ఓడినా సేవలందిస్తున్న
- ప్రజలు ఆలోచించాలి.. పనిచేసే వారినే ఆదరించాలి
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని/మంథని రూరల్/రామగిరి, అక్టోబర్ 3: కుట్రలు, కుతంత్రాలు, నక్కజిత్తులే కాంగ్రెస్ పార్టీ విధానమని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ విరుచుకుపడ్డారు. 40 ఏండ్లుగా అడ్డదారిలో గెలిచి అధికారం వెలగబెడుతున్న ఓ కుటుంబంతో ఇక్కడి ప్రజలకు ఒరిగిందేమీలేదని మండిపడ్డారు. ప్రజా ఆశీర్వాద యాత్ర తొమ్మిదో రోజైన మంగళవారం బల్దియా చైర్ పర్సన్ పుట్ట శైలజ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మంథని, రామగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో మంథనికి కూతవేటు దూరంలో ఉన్న పుట్టపాక అభివృద్ధి చెందడానికి 50 ఏండ్లు పట్టిందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈ ఊరిలో సీసీ రోడ్లు నిర్మించానని గుర్తు చేశారు. ఈ మట్టిలో పుట్టినగా బిడ్డగా.. ఇక్కడి ప్రజల కష్టాలు పూర్తిగా తెలుసన్నారు. స్వాతంత్య్రం వచ్చిన 76 సంవత్సరాల్లో మంథని నియోజకవర్గం నుంచి బీసీ ఎమ్మెల్యేగా ఎన్నికైన మొట్ట మొదటి వ్యక్తిని తానే అని అన్నారు. ప్రజలకు దగ్గరవుతున్న తనపై కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని ఆక్షేపించారు. ఐదేండ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి తనపై చేసిన ఆరోపణలను ఎందుకు రుజువు చేయలేదని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఓడినా సీఎం కేసీఆర్ నాకు జడ్పీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారని చెప్పారు. ఈ హోదాలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులకు అందించానని చెప్పారు. ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మవద్దని సూచించారు. ఒక బిడ్డగా..అన్నగా..తమ్ముడిగా మీముందుకు వస్తున్న తనను ఆదరించాలని కోరారు. మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, లక్కెపూర్ క్రాస్, కూచీరాజ్‌పల్లి, శ్రీరాంనగర్, మంథని మండలంలోని పుట్టపాక, రామగిరి మండలంలోని రామయ్యపల్లి క్రాస్, మంథని మండలంలోని సిద్ధపల్లి, అక్కెపల్లి, రామగిరి మండలం రాజాపూర్, లద్నాపూర్, ఆదివారం పేట, నాగెపల్లి, పన్నూరు(సెంటినరీకాలనీ) గ్రామాల మీదుగా కొనసాగింది. . 9 రోజు పాదయాత్ర దాదాపు 200కిలో మీటర్లకు పైగా పూర్తి చేసుకొని మంథని మండలం నుంచి రామగిరి మండలానికి చేరుకుంది. రాత్రి పన్నూరులోని సాయిరాం గార్డెన్స్‌లో బసచేశారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు..**

పుట్టపాక గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కొత్త రమాదేవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పుట్టపాక వార్డు సభ్యురాలు కన్నూరి విజయ రాజబాపు,కార్యకర్తలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీలు తగరం సుమలత, మ్యాదరవేన శారదకుమార్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్లు ఎక్కటి అనంతరెడ్డి, దాసరి రాయలింగు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, సర్పంచ్‌లు మిట్ట సత్యనారాయణ, రోడ్డ మమతా శ్రీనివాస్, రాజయ్య, పాశం ఓదెలు, బుర్ర పద్మ శంకర్‌గౌడ్, బడికెల విజయ శ్రీనివాస్, మైదం కుమార్, కొండవేన ఓదెలు, పల్లె ప్రతిమ పీవీరావు, అల్లం పద్మ తిరుపతి, ఎంపీటీసీలు, కుమారస్వామి, రాజసంపత్, ఉమా, పెగడ శ్రీనివాస్, కౌన్సిలర్లు వీకే. రవి, కర్ర లింగయ్య, నక్క నాగేంద్ర శంకర్, యాకుబ్, నాయకులు కర్రు నాగయ్య, ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆకుల కిరణ్, శంకేసి రవీందర్, పులిపాక కిరణ్, ఊదరి సదానందం, శ్రీశైలం, కొమురయ్య, సారయ్య, కుమార్ పాల్గొన్నారు.

**పాదయాత్రలో అస్వస్థత**

పుట్ట మధూకర్ ప్రజా ఆశీర్వాద యాత్ర రామగిరి మండలం నాగెపల్లి ఎక్స్‌రోడ్ వద్దకు చేరుకుంది. పాదయాత్రలో మాట్లాడుతుండగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 20 నిమిషాల వ్యవధిలో ఆయన ఆరోగ్యం కుదుట పడింది. ఈ రోజు నిర్వహించాల్సి పాదయాత్ర పన్నూర్ గ్రామంలో ముగియాల్సి ఉంది. కేవలం రెండు కిలో మీటర్ల దూరం మాత్రమే ఉండడంతో తిరిగి తన పాదయాత్రను కొనసాగిస్తున్నారు.

## 2.1 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా సాధించాలి

**సీఎండీ శ్రీధర్ దిశా నిర్దేశం**

రామగిరి, అక్టోబర్ 3: దేశ వ్యాప్తంగా బొగ్గుకు తీవ్రమైన డిమాండ్ ఏర్పడుతున్నదని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మిగిలిన 6 నెలల కాలంలో నిత్యం కనీసం 2.10 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్ సూచించారు. తద్వారా మార్చి నెలాఖరుకల్లా 720 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని దాటాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి ఆరు నెలల కాలంలో వర్షాల వల్ల కొంత ఇబ్బంది కలిగినప్పటికీ అన్ని అవరోధాలను అధిగమిస్తూ గత ఏడాదిపై బొగ్గు రవాణాలో 12 శాతం వృద్ధిని, బొగ్గు ఉత్పత్తిలో 7 శాతం వృద్ధిని, ఓబీ తొలగింపులో దాదాపు 15 శాతం వృద్ధిని సాధించడంపై సీఎండీ హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన ఆరు నెలల కాలం ఎంతో కీలకమైందని, బొగ్గుకు తీవ్రమైన డిమాండ్ వస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే దఫా రూ.1750 కోట్ల వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించామని, అలాగే సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా 32 శాతం లాభాల వాటా మొత్తం రూ.711 కోట్లు దసరా పండుగకు ముందే విడుదల చేయనున్నామని ప్రకటించారు. ఆ తర్వాత దీపావళి బోనస్ కూడా పండుగకు ముందే కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్పెషల్ క్యాంపెయిన్ 3.0 ప్రారంభం

గోదావరిఖని, అక్టోబర్ 3: సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ 3.0ను జీఎం చింతల శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ కోల్ మినిస్ట్రీ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో అక్టోబర్ 2 నుంచి 31వరకు పని స్థలాల్లో పరిసరాల శుభ్రత, కార్యాలయాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, కాలనీల సుందరీకరణ తదితర కార్యక్రమాలను నిర్వహిం చనున్నట్లు వివరించారు. ఈ క్యాంపెయిన్‌ను విజయవంతం చేసి ఆర్జీ-1ను ముందంజలో నిలపాలన్నారు. మన పరిసరాలను, పని స్థలాలను శుభ్రంగా ఉంచినట్లయితే దేశం కూడా శుభ్రంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం లక్ష్మీనారాయణ, ఆంజనేయ ప్రసాద్, యూనియన్ల నాయకులు సత్యనారాయణ, సాయిరెడ్డి, సారంగపాణి సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


కమాన్‌పూర్, అక్టోబర్ 3: పెంచికల్‌పేటకు చెందిన హన్మంత్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.24వేల విలువైన చెక్కును బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం అందజేశారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధుకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కొండ వెంకటేష్, ఎంపీటీసీ కామ శ్రీనివాస్, నాయకులు బైరి అంజయ్య, కాట హృదయ కుమార్, సాగర్ల లక్ష్మణ్, కామ శ్రీను, నారాయణ, భూతపల్లి కిట్టు, కమ్మటి సాయి, సుధాకర్, కుమ్మరి రమేష్, మొగిళి, రాచకొండ రమేష్, శ్రీకాంత్, కబీర్, సందీప్, మారుతి తదితరులున్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 3: సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియా సేవా సమితి ద్వారా జ్యూట్ బ్యాగ్ తయారీ శిక్షణకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం (ప)రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. చిన్న , ఇతర మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి సేవా ద్వారా జ్యూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల కార్మిక కుటుంబాల మహిళలు, ప్రభావిత గ్రామాల మహిళలు ఈ నెల 7 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఓదెల, అక్టోబర్ 3: శానగొండ గ్రామానికి చెందిన నలుగురి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. రేవెల్లి కుమారస్వామిని కులం పేరుతో దూషించి కొట్టినట్లు కుమారస్వామి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శానగొండకు చెందిన ఎర్రవెల్లి ప్రణయ్ భాస్కర్, ఉదయ భాస్కర్, రమాదేవి, సంపత్‌రావుల పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



దివ్యాంగుడికి ఆపరేటెడ్ ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

# దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయం

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- 121 మందికి ఆపరేటెడ్ ట్రైసైకిళ్ల పంపిణీ

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 3: దివ్యాంగుల సంక్షేమమే సర్కారు ధ్యేయమని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. నిస్సహాయస్థితిలో ఉన్న వారికి సహాయ ఉపకరణాలు అందజేసి అండగా నిలుస్తామని చెప్పారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మంగళవారం జిల్లా దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాగులకు ఆపరేటెడ్ ట్రైసైకిళ్లను అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) అరుణశ్రీతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఈ ట్రైసైకిళ్లను వినియోగించుకొని సాధారణ జీవితం గడపాలని, ఆర్థికాభివృద్ధి సాధించాలని అభిలషించారు. పెద్దపల్లి మండలంలో 63 మందికి, సుల్తానాబాద్ మండలంలో 16 మందికి, ఓదెల మండలంలో 18 మందికి, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 11 మంది, జూలపల్లి మండలంలో 5గురికి, ఎలిగేడు మండలంలో ఇద్దరికి, ధర్మారం మండలంలో 6గురికి మొత్తం 121 మందికి ఆపరేటెడ్ ట్రైసైకిళ్లను అందజేశామని తెలిపారు. కాగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ జిల్లా సంక్షేమశాఖ అధికారి రవూఫ్‌ఖాన్, సీడీపీవో కవిత, ఎంపీపీలు బాలాజీరావు, బండారి స్రవంతి శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్లు మాదిరెడ్డి నర్సింహారెడ్డి, జూపల్లి సందీప్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ సలేంద్ర రాములు యాదవ్ పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రాజెక్టు ఫస్ట్ యూనిట్ జాతికి అంకితం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

జ్యోతినగర్, అక్టోబర్ 3: విభజన చట్ట ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తిలో ఫేస్ 1 కింద పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో నిర్మించిన 1600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ప్రథమంగా 800 మెగావాట్ల ఫస్ట్ యూనిట్‌ను మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితమిచ్చారు. దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో రూ. 10,599 కోట్లతో నిర్మించిన 1600 (2x800)మెగావాట్ల ఈ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు 2016, జనవరి 29 జీరో తేదీతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కరోనా నేపథ్యంలో ప్లాంట్ ఏర్పాటు సుదీర్ఘ కాలం సాగింది. ఇటీవలనే ఫస్ట్ యూనిట్ పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి నమోదు కావడంతో గత నెల సెప్టెంబర్ 28న యూనిట్ విద్యుత్‌ను కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్ చేశారు. మంగళవారం ప్రధాని నిజామాబాద్ సభలో ప్రారంభించారు. ఎన్టీపీసీ ఉద్యోగులు టౌన్‌షిప్‌లోని కాకతీయ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా తిలకించారు.

# వేగంగా నగర సుందరీకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- మంత్రి కేటీఆర్ సహకారంతో పనులు
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కోల్‌సిటీ, అక్టోబర్ 3: మంత్రి కేటీఆర్ సహకారంతో రామగుండం నగర సుందరీకరణ పనుల్లో వేగం పెంచినట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. నగర పాలక సంస్థ పరిధి 48వ డివిజన్‌లో మంగళవారం రూ.35 లక్షలతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆ డివిజన్‌లోని స్వశక్తి మహిళల సమావేశాల కోసం రూ.10 లక్షలతో మంజూరు చేసిన స్వశక్తి మహిళా భవన్ నిర్మాణంతో పాటు సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌లో చేపట్టాల్సిన పనులకు నిధులు కావాలని అడగగానే రూ.100 కోట్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను డివిజన్ కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కో-ఆప్షన్ తానిపర్తి విజయలక్ష్మీ గోపాల్‌రావు, డివిజన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పొన్నం రాంమూర్తి, కిషన్‌రెడ్డి, నాని, నూనె ఓదెలు, ఆర్పీ లావణ్య, సుమలత, ఆశ కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.